అంతరిక్షంపై లోతైన అవగాహన

- ఓయూలో 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ
- ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం
- పలు అంశాలపై ప్రసంగించిన పలువురు శాస్త్రవేత్తలు

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: జాతీయ అంతరిక్ష దినోత్సవం ఆధ్వర్యంలో ఓయూ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చంద్రునిపై కాలుమోపిన నాలుగో దేశంగా, చంద్రుని దక్షిణ ధృవంపై అడుగిడిన మొదటి దేశంగా భారత్ గతేడాది ఆగస్టు 23న రికార్డు సృష్టించిందన్నారు. 23నే జాతీయ అంతరిక్ష దినోత్సవంగా కేంద్రప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఎన్ఆర్ఎస్‌సీ శాస్త్రవేత్త ఎస్ఎఫ్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రయాన్-3, ఇస్రో సాధించిన విజయాలపై ప్రసంగించారు. అంతరిక్ష శాస్త్రంపై లోతైన అవగాహనను పెంపొందించేందుకు కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎగ్జిబిషన్‌లో పలు నమూనాలు ప్రదర్శించారు. అనంతరం ఇస్రో గగన్‌యాన్ మిషన్‌పై స్లోగన్ (వన్‌లైన్ ఫ్రేజ్) రైటింగ్ పోటీలను సైతం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, స్టూడెంట్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: ఓయూ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చేనెల 5లోగా ఆయా కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 12వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడవచ్చని సూచించారు.

ఎంసీఏ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని ఎంసీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) (రెండేళ్ల కోర్సు) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 30 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడవచ్చని పేర్కొన్నారు.

లా కోర్సుల్లో ఎన్ఐక్యూ కోటా ప్రవేశాలకు ఆహ్వానం

ఓయూ లా కళాశాలలో వివిధ కోర్సుల్లో నేషనల్ ఇంటిగ్రేషన్ కోటా (ఎన్ఐక్యూ)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులతో పాటు కాన్‌స్టిట్యూషనల్ లా, కార్పొరేట్ అండ్ సెక్యూరిటీస్ లా, లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ లా విభాగాల్లో ఎల్ఎల్ఎం (డే), ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిసొల్యూషన్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ ఎకనామిక్ లా, క్రిమినాలజీ అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ విభాగాల్లో ఎల్ఎల్ఎం (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు ఫారాలను వచ్చే నెల 10లోగా కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సనత్‌నగర్ ఈఎస్ఐసీకి 'గెస్చర్ ఆఫ్ అప్రిసియేషన్'

ఢిల్లీలో ఐసీఎంఆర్ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్యులు డాక్టర్ రాజీవ్‌కుమార్ బండారు, డాక్టర్ మెహిదీ అలీ మీర్జా

అమీర్‌పేట్, ఆగస్టు 22: కొవిడ్19 విపత్తు సమయంలో రోగులకు అందించిన అత్యుత్తమ సేవలను నేషనల్ క్లినికల్ రిజిస్ట్రీ ఫర్ కొవిడ్-19 (ఎన్‌సీఆర్సీ) క్రోడీకరించింది. విశేష సేవలందించిన ఆసుపత్రులను గుర్తించింది. న్యూ ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో గురువారం జరిగిన 'రిపోర్ట్ రిలీజ్ అండ్ డిస్సిమినేషన్ సమిట్'లో ప్రతిభ చాటిన వైద్యశాలలను గుర్తించి 'గెస్చర్ ఆఫ్ అప్రిసియేషన్' అవార్డులు అందించింది. ఈఎస్ఐసీకి చెందిన వైద్యులు డాక్టర్ రాజీవ్‌కుమార్ బండారు, డాక్టర్ మెహిదీ అలీ మీర్జా గురువారం అవార్డును నీతి ఆయోగ్ సభ్యులు వినోద్‌పాల్, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహల్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రస్తుత డీన్ డాక్టర్ శిరీశ్ జి.చవాన్ సైతం ఈఎస్ఐసీని అన్ని విభాగాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యులతో కలిసి కృషి చేస్తున్నారని అవార్డును అందుకున్న డాక్టర్ రాజీవ్‌కుమార్ బండారు, డాక్టర్ మెహిదీ అలీ మీర్జా తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి సమస్యలను వివరిస్తున్న నల్లగుట్టవాసులు

బేగంపేట్, ఆగస్టు 22: బస్తీల్లో ఎవరికి ఏ సమస్యలున్నా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లగుట్ట కరీంకాంపౌండ్ వాసులు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి గురువారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో బస్తీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన తలసాని ఈనెల 27న అధికారులతో పర్యటిస్తానని హామీ ఇచ్చారు.

కూలిన చెట్టు.. తప్పిన పెను ప్రమాదం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: తార్నాక స్ట్రీట్ నంబర్-2లో భారీ వృక్షం నేలకూలింది. కొమ్మలు హైటెన్షన్ విద్యుత్ వైర్లపై పడడంతో వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో వైర్ల కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి హుటాహుటిన డీఆర్ఎస్ బృందం, హార్టికల్చర్, విద్యుత్, శానిటేషన్ అధికారులను అప్రమత్తం చేసి, అక్కడికి చేరుకున్నారు. చెట్ల కొమ్మల సమస్యను పరిష్కరించారు.

చెట్టుకొమ్మల తొలగింపు

అడ్డగుట్ట: మెట్టుగూడ విజయపురికాలనీలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్టుకొమ్మలను హార్టికల్చర్ అధికారులు తొలగించారు. సెయింట్ ఆన్స్ స్కూల్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డుకిరువైపుల కొమ్మలు రోడ్డుపైకి వచ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో బీజేపీ నేత మల్లికంటి వీరన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు చెట్టుకొమ్మలను తొలగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ సురేశ్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యతపై దృష్టి సారించాలి

బాలల సంరక్షణ ప్రోగ్రాం మేనేజర్

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 22: చదువుతో పాటు యువత వృత్తి నైపుణ్యాలను నేర్చుకోవాలని యూనిసెఫ్ బాలల సంరక్షణ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్ రాజ్ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సహకార అభివృద్ధి సంస్థ, అప్సా సంస్థల ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లో నెల పాటు ఉచిత బ్యూటీషియన్ బేసిక్ కోర్సు శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది బాలికలకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. అప్సా కోఆర్డినేటర్ ఎం.బస్వరాజ్ మాట్లాడుతూ బస్తీలలో ఉండే యువతకు తమ సంస్థ ఆధ్వర్యంలో మగ్గం, జ్యూట్ బ్యాగుల తయారీ, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ నాయకుడు జి.శ్రీరాములు, ట్రైనర్ రూత, అప్సా సిబ్బంది ఎన్.శోభ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సర్టిఫికెట్లను అందజేసిన యూనిసెఫ్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్ రాజ్

ప్రభుత్వ పాఠశాలలో హెల్మెట్లు పంపిణీ

బొల్లారం, ఆగస్టు 22: బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు ఆధ్వర్యంలో గురువారం తిరుమలగిరి ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియామాల గూరించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిలోంచి నగ్నంగా బయటకు.. కేసు నమోదు

మారేడ్‌పల్లి, ఆగస్టు 22: లాడ్జి నుంచి నగ్నంగా ఓ వ్యక్తి బయటకు రావడంతో భయాందోళనకు గురైన కాలనీవాసులు గోపాలపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని లాడ్జి నిర్వాహకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ప్రవేశపెట్టగా నిర్వాహకుడికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుస్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న రెజిమెంటల్‌బజార్‌లోని సిద్ధి వినాయక లాడ్జిలో కొంత కాలంగా వ్యభిచారం నడుస్తోందనే ఆరోపణలున్నాయి. బుధవారం రాత్రి ఓ వ్యక్తి నగ్నంగా లాడ్జి గదిలోంచి కాలనీలోకి రావడంతో బస్తీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. లాడ్జి నిర్వాహకుడిని నిలదీశారు. అంతేగాకుండా గోపాలపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా లాడ్జి నుంచి వ్యక్తి ఒంటిపై బట్టలు లేకుండానే పారిపోతున్నట్లు వెల్లడైంది. లాడ్జి నిర్వాహకుడు రవీందర్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకొని కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి రెండు రోజుల పాటు జైలు శిక్ష, రూ.2500ల జరిమాన విధించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. లాడ్జిల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రుణమాఫీ పేరుతో ప్రభుత్వం మోసం


అన్నానగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మాజీ బోర్డు సభ్యురాలు అనిత, బీఆర్ఎస్ నేతలు

మారేడ్‌పల్లి, ఆగస్టు 22: మాయ మాటలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని రుణమాఫీ పేరుతో మోసం చేస్తున్నదని కంటోన్మెంట్ బోర్డు మాజీ బోర్డు సభ్యురాలు అనిత అన్నారు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కంటోన్మెంట్ అన్నానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అనిత మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రైతులను అన్ని విధాలుగా అందుకున్నాడని గుర్తుచేశారు. రైతుబంధు, రైతు భరోసా లాంటి పథకాలను అమలు చేసి వారికి అండగా నిలించారని అన్నారు. ఆచరణలో అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేస్తామని రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్‌రావుపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి చేసిన వాఖ్యానాలను వెంటనే వెనక్కి తీసుకొని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీను, కనకయ్య, దనుంజయ్, డీసీఎం శ్రీను, సన్ని, కుమార్, మధు, ప్రకాశ్, ఆటో యూనియన్ అధ్యక్షుడు ప్రశాంత్, రాంచందర్, రామకృష్ణ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి


కృష్ణస్వామి జయంతి ప్రతులను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 22: నగర తొలి మేయర్, సంఘ సంస్కర్త, పత్రికా సంపాదకుడు కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతిని ఈనెల 26 సికింద్రాబాద్ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో నిర్వహిస్తున్నామని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు తెలిపారు. గురువారం ముదిరాజ్ భవన్‌లో డి.సదానంద్, జి.దివాకర్, శ్రీకాంత్, సురేందర్, నరేశ్, వెంకట్‌రావు, మన్మోహన్, నర్సింగ్‌రావు మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి మహోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతారని అన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ముదిరాజ్ ప్రకముఖులకు సన్మానాలు, పేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ ఉంటుందన్నారు.

ఇందిరానగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

సికింద్రాబాద్, ఆగస్టు 22: ఇందిరానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోయి వెంటనే పరిష్కరిస్తామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. అక్కడ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్ట్రామ్ వాటర్‌లైన్ డిసెంబర్ 2022లో మంజూరయ్యిందని, కానీ కాంట్రాక్టర్ సరిగ్గా పని చేయకపోవడం వల్ల పనులు మొదలు పెట్టలేదని వివరించారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ హేమ జీహెచ్ఎంసీ అధికారులకు తెలుపగా టెండర్ రద్దు చేస్తామని నోటీసులు జారీ చేయగా, కాంట్రాక్టర్ పనులు మొదలు పెడతామని తెలిపారు. పనులు రూ.70లక్షలతో చేపట్టినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకుడు కరాటే రాజు, ఇందిరానగర్‌కాలనీ అధ్యక్షుడు నగరపు శ్యాం తదితరులు పాల్గొన్నారు.

బానోతు కృష్ణకు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: తెలంగాణ ఉద్యమకారుడు బానోతు కృష్ణ ఓయూ లింగ్విస్టిక్స్ విభాగం నుంచి డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ కె.రమేశ్‌కుమార్ పర్యవేక్షణలో 'ఎ ఫోనోలాజికల్ స్టడీ ఆఫ్ లంబాడీ అండ్ ఇంగ్లిష్: ఏ డిస్క్రిప్టివ్ స్టడీ' అంశంపై పరిశోధన పూర్తి చేసి కృష్ణ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ చోక్లాతండాకు చెందిన కృష్ణ ప్రస్తుతం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఓయూ జేఏసీ నాయకుడిగా చురుకైన పాత్ర పోషించిన కృష్ణ ఉద్యమంలో పోలీసుల బుల్లెట్లకు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందారు. అప్పటి నుంచి బుల్లెట్ కృష్ణగా పిలుస్తున్న ఆయనను ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

క్రీడలతో దేశ ఖ్యాతి పెంచాలి

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 22: కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు దేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల బెంగుళూరులో జరిగిన 11వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన అమృతరెడ్డి, నిధివర్మ వేర్వేరు విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించి ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా వారితో పాటు కోచ్ గోపాల్‌రెడ్డిని కేంద్ర మంత్రి అభినందించారు. ఆడపిల్లలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను కూడా ఆయన ప్రశంసించారు. ఎస్ఆర్కే విద్యాసంస్థల చైర్మన్ శివరామకృష్ణ, దిపక్‌వర్మ, వనితవర్మ పాల్గొన్నారు.


కరాటే విజేతలు అమృతరెడ్డి, నిధివర్మను అభినందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అక్రమంగా వాహనాల పార్కింగ్

పోలీసులకు ఫిర్యాదు చేసిన బేగంపేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య


నిర్వాహకులతో మాట్లాడుతున్న బేగంపేట్ డీసీ సమ్మయ్య

బేగంపేట్, ఆగస్టు 22: బేగంపేట్ సర్కిల్ పరిధిలోని బేగంపేట్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఎస్ బ్యాంక్ సమీపంలో జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పార్కింగ్‌తో వసూళ్లకు పాల్పడుతున్న మహ్మద్ హమీద్‌ఖాన్‌పై బేగంపేట్ పోలీస్‌స్టేషన్‌లో జీహెచ్ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య ఫిర్యాదు చేశారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రం వద్ద ఓ భవనం సెల్లార్‌లో అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేసి కారుకు గంటకు రూ.50 చొప్పున వసూల్ చేస్తున్నట్టు మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ డీసీ, జెడ్సీల దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీసీ గురువారం ఆరా తీశారు. పార్కింగ్‌కు రసీదు కూడా లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ పార్కింగ్‌దారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

12 ఏండ్లుగా పార్కింగ్ దందా..

అక్రమ పార్కింగ్ దందా 12 ఏండ్లుగా కొనసాగుతున్నదని విచారణలో తేలింది. అయినప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. రోజుకు సుమారు 4వందల వాహనాలు ఇక్కడికి వస్తుంటాయి. దీంతో ప్రతిరోజు లక్షలు వసూలు చేస్తున్నారు. పార్కింగ్ సమయంలో ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు సైతం పాల్పడేవారు. ఇలా గతంలో పోలీస్‌స్టేషన్ వరకు తగాదాలు వెళ్లిన దాఖలాలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసే ఓ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్ అయిన దాఖలాలు ఉన్నాయి. అంటే ఇక్కడ ఏ స్థాయిలో పార్కింగ్ దందా నడుస్తుందో అర్థమవుతోదని స్థానికులు పేర్కొంటున్నారు.

అదానీ ఆస్తులు ప్రజలకు చెందే వరకు పోరాటం


పికెట్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడ్‌పల్లి, ఆగస్టు 22: అదానీ దోచుకున్న ఆస్తులు దేశ ప్రజలకు చెందే వరకు, జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసే వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. గురువారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గన్‌పార్కుకు చేరుకొని అక్కడి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ర్యాలీగా ఈడీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సంపద ప్రజలకు చెందాలని రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని అన్నారు. దేశ సంపదను కాపాడాల్సిన సెబీ చైర్మన్ దోపిడీలో భాగస్వామిగా ఉన్నారని హిడెన్ బర్గ్ స్వతంత్ర సంస్థ పరిశోధించి బయట పెట్టడంతో ప్రపంచమే ఆశ్చర్యపోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బద్రినాథ్‌యాదవ్, వెంకటేశ్, రామన్న, సంకి రవీందర్, సంజీవ, తేజ్‌పాల్, సదానంద్‌గౌడ్, సంతోష్‌యాదవ్; నరేశ్, జయప్రకాశ్, వేణుగోపాల్, భిక్షపతి, విష్ణు, ముఖేశ్, ధనుశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో ఎన్ఈపీ 2020 కీలకపాత్ర


హిందీ విభాగం జర్నల్ 'సముచయ్'ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: విద్యారంగంలో జాతీయ విద్యావిధానం-2020 (ఎన్ఈపీ 2020) దేశంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఏపీ సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. చురుకైన విద్య, పరిశోధన, ఆవిష్కరణ విద్యావ్యవస్థను రూపొందించడంలో ఇది గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందన్నారు. ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ వర్సిటీ (ఇఫ్లూ) హిందీ విభాగం ఆధ్వర్యంలో 'ఎన్ఈపీ 2020 అండ్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్'పై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. గురువారం సదస్సు ప్రారంభోత్సవంలో ప్రొఫెసర్ కట్టిమణి కీలకోపన్యాసం చేశారు. బలమైన భారతీయ తత్త్వంతో ప్రపంచ పౌరులను తయారు చేసే విద్యావ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా ఎన్ఈపీ ఉందని వివరించారు. ఈ సందర్భంగా హిందీ విభాగం జర్నల్ 'సముచయ్'ను అతిథులు ఆవిష్కరించారు. ఇఫ్లూ వీసీ (యాక్టింగ్) ప్రొఫెసర్ సురభి భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.నరసింహారావు, డీన్ ప్రొఫెసర్ సాంబ సాల్వే, హిందీ విభాగం హెడ్ ప్రొఫెసర్ రేఖారాణి, ప్రొఫెసర్లు సత్రాజు, శివానీ జార్జ్, డాక్టర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన శానిటేషన్ డీఈ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: సికింద్రాబాద్ సర్కిల్ తార్నాక డివిజన్ శానిటేషన్ డీఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్ నగర డిప్యూటీ మేయర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన వెంకటేశ్ డిప్యూటీ మేయర్‌కు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌ను మరింత శుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐదో వార్డులో నీటి సమస్య పరిష్కరించాలి

మారేడ్‌పల్లి: ఐదో వార్డు పరిధిలోని బస్తీ, కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సామాజికవేత్త తేలుకుంట సతీశ్‌గుప్త పలు కాలనీల అధ్యక్షులతో కలిసి కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో గురువారం సీఈఓ మధుకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐదురోజులకు ఒకసారి నీటి సరఫరాతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నీటి సరఫరా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఈఓ హామీ ఇచ్చినట్టు సతీశ్ వెల్లడించారు. కార్యక్రమంలో శోభన, ఇంద్రపురి, గణేశ్, పిఅండ్‌టీ కాలనీల అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, అజయ్, అధ్యక్షుడు మోహన్ ఉన్నారు.

2 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో వచ్చే నెల 2వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 90004 44973, 79899 03001 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైల్లోంచి జారిపడి వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, ఆగస్టు 22: రైల్లోంచి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఖాజామోహినుద్దీన్ (35) సికింద్రాబాద్ నుంచి భువనగిరి వెళ్తుండగా ఘటుకేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య జారి పడడంతో తలకు తీవ్రగాయంతో అక్కడిక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని భార్య, ఏడేండ్ల కుమార్తె ఉంది.

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.S. No. 563 OF 2024
Between:
G. Santosh Kumar @ Govindrulu Santosh Kumar ...**PLAINTIFF**
and
Tahsildar And Another ...**DEFENDANTS**
To,
All Concerned
Please take notice that the above named plaintiff filed the above plaint against the Defendants stating that the Plaintiff is the only legal heir of **Late Sri. G.D. Prasad Rao @ G. Durga Prasad Rao** And **Late Smt. Govindluri Nirmala Prasad** and he is praying to the Hon'ble Court to declare him as Legal Heir and pass decree in his favour and the above posted on **27-08-2024 at 10:30 A.M.** before the Hon'ble Court for your appearance, therefore you are hereby informed to file your objection, if any either in person or through your counsel duly instructed otherwise the above matter will decided according to law.
SCHEDULE OF THE PROPERTY
All that Flat Bearing No. F-3, in First Floor of Northern Block, i.e., **Block No. A** of area admeasuring **1400 Square Feets** (including Common Area) in **"Lakshmi Saraswathi Apartments"** situated at Door No. 2-6-16 and 17, in Survey No. 26, with undivided share of Land admeasuring **35.00 Square Yards** or 29.26 Square Meters, out of 1350 Square Yards situated at Chandulal Bowli, Sikh Village, Secunderabad, Cantonment, Telangana State., having its **PTIN No. PT06H22133544**, (having its **S.C.B No. 6-21-017**) and Bounded By: **North: Open To Sky And Neighbour's Land, South: Duct And Flat No. F1, East: Corridor and Flat No. S-4, West: Open To Sky and Road.**
//By Order Of The Hon'ble Court//
Sd/- Anshul Agarwal,
Advocate, #1-2-298, Amarnath Kunj, St No. 7, Domalguda, Hyderabad-500029, T.S. # PH No. 8801617471.